ఉపన్యాసం దంచుతోంటే రైల్లో కొంతమంది గంగిరెద్దులా తలకాయలు ఊపడం మొదలు పెట్టారు. వెంటనే 'కస్తూరిబాయి మాత్రలు—అజీర్ణానికి దివ్యమైన ఔషధం' అంటూ ధోరణి మార్చాడు, చేతిలో ఉన్న సంచిలోంచి ఒక సీసా తీసి.

ఒకటేమిటి - ఇటువంటి పేర్లు చాలా వాటికి ఉన్నాయి. జవహర్‌లాల్ కేఫ్, గాంధీ వర్యం, పటేలు బీడీలు, పట్టాభి క్షవరశాల, వగైరా.

రైళ్ళలో వచ్చిన మార్పుకూడా చాలా గమనించతగ్గదే. నాలుగు క్లాసు లల్లా మూడు రంగుల జండాలా మూడైపోయాయి. జరిగిన గందరగోళం ఏమిటంటే-ఇంటరు తరగతికి ఉన్న INT లో T ని పూర్తిగా బహిష్కరించడం, N ని రెండు వంతులు బహిష్కరించడం అయేటప్పటికి ఇంటరు సెకండు క్లాసై ఊరుకుంది.

మూడు భాషలు-రాష్ట్రానికి ఒకటి, దేశానికి ఒకటి, అంతర్జాతీయంగా ఒకటి. ఏభై పాళ్లు ఉన్న తెలుగు ముప్పైమూడు పాళ్లు అవడం, 'గ్రైండ్ మదర్ కందిపచ్చడి బనాతీ హై' అన్నట్టు! తెలుగుభాష త్రివర్ణభాష అయిపోవడం.

ఇంకా వచ్చాయి మార్పులు. బెజవాడ విజయవాడగా మారడం, కోకనాడ కాకినాడ అవడం ఇత్యాదులు. ఈ పేర్లు మారిన క్రొత్తరికంలో ఒకమార్పు జరిగింది.

ఒకబళ్లో తెలుగు మాష్టారు పేర్లు మారిన క్రొత్తలో ఒకరోజున క్లాసుకు వచ్చి బోర్డుకేసి చూశాడు. ఆయన్ని అందరూ తెలుగు పంతులు గారని పిలవడంవల్ల, పెనంమీదఉన్న పెసరట్టును తిరగేసినట్టు, తెలుగును తెగులు చేసి 'తెగులు బందులు' అని పెద్ద అక్షరాలతో వ్రాసి ఉంది. మేష్టారు యీ అక్షరాలు కళ్ళ పడగానే ఒక దీర్ఘ శ్వాస విడిచాట్ట.

# 'కాలే కడుపుకి, మండే బూడిద'

వై. శేషగిరిరావు

శర్మ 24 వ తారీఖునే పెట్టీ బేడా సర్దేశాడు. సీత వచ్చి అడిగింది, 'ఎప్పుడేమిటండీ ప్రయాణం' అని. 'ఎల్లుండే, 27 వ తారీఖునేగా కాలేజీ' అన్నాడు.

'మూటా, ముల్లీ కట్టేశారు లాగుంది. కొంచెం ఆవకాయ కూడా తీసుకెళ్ళరాదండీ- మళ్ళీ యే సెలవులకి రానంటున్నారు కూడాను. ఇక్కడ నుంచి యెవళ్లూ వచ్చేవాళ్లు కూడా లేరు' అంది.

'ఆఁ ఎందుకే' అని తోసేశాడు పెళ్లాం మాట శర్మ. హాస్టల్లో కూరలు బాగా వుండవుగా మరి. అదీగాక యెప్పుడూ యే కూటో చేస్తున్నాడాయె నాయరు. ఏదో కాలే కడుపుకి మండీ బూడి దన్నట్టు తింటున్నాడు శర్మ. ఎప్పుడు కూర బాగుండకపోయినా సీత అన్నమాటలు జ్ఞాపకానికి వస్తున్నాయి శర్మకి.

వెఱ్ఱివాడు. ఆఁ బాగా చెప్పావే. కొంచెం ఆవకాయ జాడీలో పెట్టి యియ్యి అనవచ్చాం. అహఁ వద్దులే అన్నాడు.

కూరా అదీ బాగుండకపోయినా అందరిలాగా సర్దుకు తినేసే రకమూ అంటే శర్మ చాలా పట్టుదల మనిషి. ఇష్టంలేని కూరంటే దాని మొహమే చూడ్డు. ఇలా యెన్నాళ్ళని కూర మానేస్తాడు. ఆ చారుమెతుకుల్తో కాలక్షేపం చేస్తాడు. శర్మని చూసినప్పుడల్లా జాలి వేస్తుంది నాకు.

పోనీ, ఎవరు మాత్రం వేసుకుంటున్నారు గనక యిక్కడ ఆవకాయ. అందరిలాగే నేనూ, నలుగురితో పాటూ నారాయణా అని సముదాయించుకుందామూ అనుకున్నాడు శర్మ. కానీ అప్పుడప్పుడు గాజుగ్లాసులో వేసుకుని తెచ్చుకుంటున్నారు ఆవకాయ కొందరు. అది చూసినప్పుడల్లా శర్మకి నోరూరుతుంది. ఆనాడు

బొత్తిగా చిక్కి ముద్దా నోటికెక్కడు. ఇంతకీ శర్మ నసాళిగాని, యెవరి నసాళ్సిన పనీ లేదు. ఆపిల్ల మొగుడిమీది మమకారంచేత ఆవకాయ తీసుకెళ్ళండీ అంటే అహఁ వద్దులే అంటాడా? వెఱ్ఱిమొహం.

పోనీ జరిగిందేదో జరిగింది. ఆవకాయ తెచ్చుకున్నవాళ్ళని ఒక పెచ్చు నాక్కూడా యిస్తారా అని అడుగుదామా అంటే శర్మకి భయం. ఎప్పుడూ అలా అడిగినవాడు కాదాయె.

పోనీ యింటికో వుత్తరం వ్రాసి ఆవకాయ పంపమందామా అంటే యేమనుకుంటారో అని భయం శర్మకి. మొదట్లో పట్టుకెళ్ళ మన్నప్పుడు ఒద్దు ఒద్దని యిప్పుడు వుత్తరం యేమంటూ వ్రాస్తాను అనుకున్నాడు శర్మ.

పోనీ శర్మే యింటికి వెళ్ళకూడదా అన్న అనుమానం కలగవచ్చు. సెలవ లివ్వందే యింటి కెందు కొచ్చావురా అని అడుగుతారా-వాళ్ళకి మాత్రం తెలియదూ? ఏదో పెళ్ళాన్ని చూడ్డాని కొచ్చా డనుకోరూ? లేదా, శర్మ చెపితేమాత్రం తప్పా యేమిటి? శర్మకి ఆపాటి ధైర్యం లేదన్న మాట నిజమే. లేకపోతే పిచ్చివాడు- అమ్మా, నువ్వు కలలో కొచ్చావే అని చెప్పరాదూ. చాటుకుండా సీతని ఆవకాయ యివ్వవే అని తెచ్చుకుంటే తీరిపోను. అది శర్మకి తోచలేదు. సెలవ లివ్వకుండా సెలవపెట్టి యెందు కొచ్చావురా అంటారనే భయం.

పోనీ యింటికి వెళ్ళిపోయి యేమిరా వచ్చావంటే- కొంచెం జ్వరం తగిలింది; అంచేత అక్కడ సదుపాయంగా వుండదని వచ్చేశాను- అని చెప్పవచ్చు. కాని జ్వరం అంటే ఆవకాయ పట్టుకెళ్ళడానికి కాదుగదా, అక్కడ రుచేనా చూపించరు అని జంకాడు శర్మ.

తెలివి తక్కువవాడు కాకపోతే అమ్మా నాన్నే యివ్వాలా ఆవకాయ. సీతని ఏ అర్థరాత్రప్పుడో దగ్గిరికి పిలిచి, 'ఆవకాయి తినాలని వుందే, అందుకోసమేవచ్చాను' అంటే యివ్వకపోతుందా. కానీ, యేమో అభంశుభం యెరగంది. తను నిజంగా జ్వరంగానే వున్నాడనుకుని యివ్వదేమో కూడాను. ఒకవేళ యిస్తుందే అనుకున్నా—ఆవకాయి, కుండలోంచి తీస్తూంటే అమ్మేనా, నాన్నేనా చూశారంటే కొంప మునుగుతుంది. ఈ ఆలోచనలతో శర్మకి యింటి దగ్గరనుంచి ఆవకాయ తెచ్చుకోవడం కష్ట మనిపించింది.

ఒకలా చెయ్యవలసింది శర్మ. పెళ్ళాన్ని పుట్టింటికి పంపమని వుత్తరం వ్రాసి, అక్కడకి వెళ్ళి తెచ్చుకోవలసింది. కాని తండ్రి కేమంటూ వ్రాస్తాను అని భయం వేసింది.

ఇంతకీ ఆ కూరలు తినలేకుండా వున్నాడు శర్మ, యెప్పుడూ ఆవకాయమీదే మనసు. 'ఏమిటండీ శర్మగారూ, మీరెప్పుడూ కూరే తినరూ' అన్నాడు పక్కని కూర్చున్నాయన.

ఇక్కడ తెలివి వుపయోగించాడు శర్మ. 'ఏమిటోనండీ. అసలు యింటిదగ్గిరే సరిగ్గా తినను నేను కూరలు. ఈ కూరలు యేమి వంటండీ, వెధవవంట రుచీపచీ వుంటేగా. అందులో ఆ నాయరుగాడు కారం ఉప్పూ తగలెయ్యడు. ఇంటిదగ్గరైతే కూరలెందుకు లెండి అసలు. ఆ ఆవకాయ వేసి కలిపేమా అంటే...' అని ఓచిన్న లెక్చరిచ్చాడు శర్మ.

ఆయనకి నిజంగా జాలి వేసింది శర్మమీద. 'అయ్యో, యిన్నాళ్ళనించీ చెప్పారు గాదేమండీ. నేను తెచ్చుకున్న ఆవకాయ అంతా ఐపోయి నట్టే. కాని ఒక్క పెచ్చుండాలన్న జ్ఞాపకం. ఉందంటే తప్పకుండా యిస్తా'నన్నాడు.

శర్మ ఆయనతో వెళ్ళి పెచ్చు తెచ్చుకున్నాడు. శర్మకి బ్రహ్మానందమైంది. కాని అమాయకుడు ఆ పెచ్చు అప్పుడు తినెయ్యాలిసింది, మర్నాడు భోజనంలో తిందామని దాచాడు.

వడ్డన అయినతరువాత పొట్లాం విప్పుతున్నాడు శర్మ. విస్తట్లో వేసుకుందా మనుకునే సందర్భంలో 'యేమిటోయ్ శర్మా, మా కెవళ్ళకీ లేందే నీకేమి'టంటూ ఆ పొట్లాం వూళ్ళాక్కని ఒకేమారు నోట్లో వేసుకున్నాడు, ఆ పక్కకాత్రేడు.

శర్మ కేమనడానికీ నోరు రాలేదు.